క్లుప్తంగా

హనిమిరెడ్డి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి: మండలలలోని ధర్మవరం శివాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ప్రత్యేక పూజల అనంతరం సమన్వయకర్తకు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డికి ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయన వెంట యూత్ నాయకుడు అశిశన ప్రభాకర్‌రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దాతలు

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ శివారులో వేంచేసి ఉన్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ప్రదక్షణ మార్గంలో నూతనంగా షెడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జీవీఎల్ కుమార్ మాట్లాడుతూ ఒంగోలుకు చెందిన పోలకం వెంకట సురేష్‌కుమార్, నాగమల్లేశ్వరి రూ.లక్ష విరాళంతో ప్రదక్షణ మార్గంలో భక్తులకు ఎండ, వానలకు తావు లేకుండా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. షెడ్డు నిర్మాణంతో భక్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి

అద్దంకి: పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసినట్లు స్టేట్ ప్రోగ్రా అధికారి రామారావు అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని గాజులపాలెం పీహెచ్‌సీ, కాకానిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేసిందీ లేనిది అడిగి తెలుసుకున్నారు. కాకానిపాలెం యూపీహెచ్‌సీ, గొర్లమిట్ట యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా వైద్య ఆరోగ్య శాఖ పోలియో చుక్కల కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ టి. వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ నవ్య, జి.జయసింహ, ఎం.హేమ మాధురి, మనోజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం

పర్చూరు (చినగంజాం): దేవరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం. అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుండాలంటూ దిశ యాప్ ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళలకు ఎటువంటి ప్రమాదకర, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే దిశ యాప్ కంట్రోల్ రూంకు 100, 181, 101 ఉమెన్ హెల్ప్‌లైన్ ఉపయోగించుకొని మహిళలు తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. మహిళా పోలీస్ వై. ప్రసన్నవాణి మాట్లాడుతూ గ్రామంలో బాలికలు, మహిళలు ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాల్సిందిగా సూచించారు. తద్వారా సమస్యలను పరిష్కరించి తగిన తక్షణ రక్షణ సహాయం చేస్తారని తెలిపారు.

వ్యవసాయం..పాడిపరిశ్రమ రెండు కళ్లు

● జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మద్దు



పశుపోషకులకు దాణా, బహుమతులు అందిస్తున్న హనుమంతరావు

చీరాల టౌన్: వ్యవసాయం తర్వాత రైతులకు ముఖ్యమైన పాడిపరిశ్రమ గ్రామీణ ప్రాంత ప్రజలకు రెండు కళ్లు అని, పాడిపరిశ్రమలో ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని బాపట్ల జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని బుర్లవారిపాలెంలో గ్రామ పశువైద్యులు డాక్టర్ టి.శివారెడ్డి ఆధ్వర్యంలో పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ షమకారంతో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరంతో పాటు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ పాడి పంటలు అన్నదాతలకు రెండు కళ్లని, పాడిపరిశ్రమతో ఆర్థిక వృద్ధి లభిస్తుందన్నారు. పాడి పరిశ్రమలో వృద్ధితో పాటు ఆర్థికాభివృద్ధి చెందాలంటే మేలుజాతి దూడలను పోషించడంతో పాటు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమానికి అనేక పథకాలు రూపొందించిందని, పాడి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి, స్వచ్ఛమైన పాల ఉత్పత్తికి పశువులను అందించాల్సిన దాణా, ప్రభుత్వం అందిస్తున్న పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు ఆరోగ్య రక్షణ కార్డులను తీసుకుంటే పాడి పశువులు వ్యాధులకు గురైనప్పటికి పాడి రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వ రాయితీ పథకాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పశువుల యాజమానులకు బహుమతులు అందించారు. శిబిరంలో 37 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 91 దూడలకు నట్టల నివారణ మందులు, కాల్షియం పెంచే ద్రావణాలు అందించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోసూరి రాధ, చీరాల ఏడీఏ డాక్టర్ ఎస్.చిట్టిబాబు, పశువైద్యాధికారులు పావని, ఆనంద భాగ్యరాజు, రవికుమార్, పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఆదివారం మేదరమెట్లలో నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేయాలని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సిద్ధం సభ వాల్‌పోస్టర్‌ను నియోజకవర్గ ఎస్సీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి హాజరవుతున్న సభను ప్రతి ఒక్క కార్యకర్త విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్సీ మండల కన్వీనర్ కట్టా రత్నరాజు, మైలా చిన్ననాగేశ్వరరావు, కూరాకుల ఇస్సాక్, గుజ్జర్లపూడి చిన్న, బండి రాంబాబు పాల్గొన్నారు.

కృష్ణ మాదిగ వ్యాఖ్యలు తగవు

చీరాల రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయవద్దని మందా కృష్ణ మాదిగ వ్యాఖ్యానించడం తగదని వైఎస్సార్ సీపీ మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి జేమ్స్ హితవు పలికారు. సోమవారం ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. రెండు రోజులు క్రితం అద్దంకిలో జరిగిన ఎమ్మార్పీఎస్ సభలో మందా కృష్ణ మాదిగ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మాదిగలు వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయవద్దని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎమ్మార్పీఎస్‌ను నడపాలని గతంలోనే మందా కృష్ణకు చెప్పామని, అయినా అతను సభలు ఏర్పాటు చేసి ఆయన తన అనుకూల రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తు మాట్లాడటం సరికాదని సూచించారు. ఆయన నడవడిక సరిగా లేక ఎంతోమంది మాదిగ సోదరులు అతడినిని విడిచి వెళ్లిపోయారని చెప్పారు. గతంలో ఆయన చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరించి లబ్ధి పొందారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్రాలకు సంబంధం లేదని పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందాలని తెలిసి కూడా చంద్రబాబు ఆనాడు మాదిగలను మోసగించేందుకు ఆర్డినెన్స్ తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా, కుల, మతాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందరికీ సమానంగా అందజేస్తున్నారని, అందులో మాదిగ సోదరులు కూడా ఉన్నారని చెప్పారు. మాదిగ సోదరులు సంయమనంతో వ్యవహరించి వైఎస్సార్ సీపీ ఓట్లు వేయాలని సూచించారు.

శివరాత్రి ప్రత్యేకతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సేవాసమితి సభ్యులు

అద్దంకి: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదిన ప్రత్యేకతపై సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కొటికలపూడి, తిమ్మారెడ్డి పాలెం, పార్వతీపురం, గోవిందారజపురం, నరసింహపురంతో ఏడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు పెద్దరెడ్డి మాట్లాడుతూ శివరాత్రిలో శి అనే అక్షరం అగ్నికి, వ అనే బీజాక్షరం నీటికి గుర్తు అని చెప్పారు. కార్యక్రమంలో ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కాటపోతురాజు, కుంచాల చిన్న వెంకయ్య, కోఘరి చిన్న వెంకటేశ్వర్లు పగడాల అశోక్, వెచ్చా రాజశేఖర్, తవిటి అమరలింగయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఆత్మరక్షణకు ప్రాచీన క్రీడలు ముఖ్యమని.. విద్యతో పాటు క్రీడలు, సమాజసేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్-2024లో భాష్యం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్లో పతకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భాష్యం విద్యార్థులకు చదువుతో పాటు క్రీడా సంబరాలు, ప్రాచీన కళలైన కరాటే, కుంగ్‌ఫూ, మార్షల్ ఆర్ట్స్‌లపై చక్కని శిక్షణ అందిస్తున్నామన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. శిరీష, ఉపాధ్యాయులు, పీఈటీ ఉన్నారు.

7న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

మహిళా హక్కులపై అవగాహన

పర్చూరు (చినగంజాం): మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు పర్చూరు సీడీపీఓ జి.సుభద్ర అవగాహన కల్పించారు. సోమవారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. మహిళలకు రాజ్యాంగ పరంగా, న్యాయపరమైన సలహాలు అందించారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళలు ఏ విధంగా ప్రవర్తించాలో ఆమె వివరించారు. సూపర్‌వైజర్ పి.దీపాదేవి పాల్గొన్నారు.



సలహాలు అందిస్తున్న సీడీపీఓ సుభద్ర

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన బాలాజీ



గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజల్లో యడం బాలాజీ

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మతల్లి ఆలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు పట్టాయిపాలెంలో కొలువైన గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ యడం బాలాజీతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన అనేక విషయాలను వారితో చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

8న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

యద్దనపూడి: మండలంలోని గన్నవరం-మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళగిరి కమాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం నాడు స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. అనంతరం అన్నదానం ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

రేపు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జె.పంగులూరు: మండల పరిధిలో రేణింగవరం జాతీయ రహదారి వెంబడి, వేద కోల్డ్ స్టోరేజ్ ఎదురగా వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు సోమవారం వైఎస్సార్ సీపీ మండల నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన (బుధవారం) పార్టీ కార్యాలయం ప్రారంభించేందుకు అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. రేణింగవరం ఫ్లైఓవర్ నుంచి జాగర్లమూడిపాలెం మీదగా ముప్పవరం, అక్కడి నుంచి వేద కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా బైకు ర్యాలీ ముప్పవరం సాయిబాబా ఆలయం వద్దకు చేరగా అక్కడ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వేలాది మంది కార్యకర్తల నడుమ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని విజయవతం చేసేందుకు మండల నాయకులు, గ్రామ నాయకులు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకుడు గాదే బ్రహ్మారెడ్డి, రేణింగవరం సర్పంచ్ హరి ప్రసాద్‌రెడ్డి, అలవలపాడు సర్పంచ్ నన్నేసా, కొండమంజులూరు సర్పంచ్ రాంబాబు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపోగు బుజ్జి, బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

పక్కా గృహం ఉండాలన్నదే సీఎం లక్ష్యం



పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: రాష్ట్రంలో ప్రతి పేద వాడికి పక్కాగా సొంతిల్లు నిర్మించి ఇవ్వాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి లక్ష్యం అని మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. కొత్త పాలెం పంచాయతీ పరిధిలో సోమవారం సొంత భూమి, సొంతింటి కల కార్యక్రమంలో భాగంగా ఆయన 53 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కొత్తపాలెం జగనన్న లేఔట్ కాలనీలో గృహాలు నిర్మించుకుంటున్న వారందరికీ ఆయన పట్టాలు అందించారు. జగనన్న కాలనీ అభివృద్ధికి పంచాయతీ నుంచి పూర్తి సహకారం ఇందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షా, గ్రామ కార్యదర్శి కాటూరి బాబురావు, వీఆర్వో బాలిగ రాధిక, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. సోమవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో వైఎస్సార్ వెలుగు పథకం మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు చర్యలు చేపట్టాలన్నారు. ఆసరా సాయాన్ని పొదుపు మహిళలు సద్వినియోగించుకుని వ్యాపారాభివృద్ధి చెందాలన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు అండగా ఉండాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతి నెల 10వ తేదీ సమావేశం నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. ఉన్నతి పథకంలో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునివృద్ధి చెందాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు.

సెయింట్ ఆన్స్‌కి ఏఐ ఎడ్యుకేషన్ చాంపియన్ అవార్డు



అవార్డులతో కళాశాల యాజమాన్యం, హెచ్‌ఓడీలు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఏఐ ఎడ్యుకేషన్ ఔట్ రీచ్ చాంపియన్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సీఎంఆర్ టెక్నికల్ కంపెనీలో ఏఐఎంఆఈఆర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. అవార్డుల మహోత్సవంలో సెయింట్ ఆన్స్ ఏఐ ఎడ్యుకేషన్ ఔట్ రీచ్ చాంపియన్ అవార్డును కైవసం చేసుకుంది. ఏఐ అనేది గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీకి అడ్వాన్స్‌డ్ టెక్నాజీ వంటిదన్నారు. చాలా మంది విద్యార్థులకు ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ ఒక కెరియర్ ఆప్షన్‌గా మరిందని చెప్పారు. విద్యార్థులు ఆసక్తి ఆధారంగా మెషిన్ లెర్నింగ్ ఇంజినీరింగ్‌గా డేటా సైంటిస్ట్‌గా, రోబోటిక్స్ ఇంజినీగ్ ఏఐ రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఏఐ ఇంజినీర్‌గా స్థిరపడి కెరీర్ ప్రారంభం నుంచి మంచి ప్యాకేజీలు అందకోగలరని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలరావు, ఏఐఎంఎల్ విభాగాదిపతి సి.హరికిసన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు మేలు



చినగంజాంలో కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



ఇంకొల్లులో కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసిన సిబ్బంది

చినగంజాం: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల స్టాల్‌ను సిబ్బంది స్థానిక మండల కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయనిక ఎరువులు వినియోగించకుండా చేపట్టిన సాగు ఎంతో ఆరోగ్యకరమైనవని, ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులతో పండిన కూరగాయలు వాడటంతో రోగాలు బారిన పడేందుకు అవకాశం ఉండదని వారు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించారు. స్టాల్‌లోని కూరగాయలను కొందరు కొనుగోలు చేశారు. జెడ్పీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ బి.జయమ్మ, కె.గీత, టి.రజని, పి.లోకేశ్వరి, బి.జ్ఞానానందం, పి.భార్గవి, ఖాదరయ్య, ప్రసన్న, భాస్కర్, తిరుపతమ్మ, విజయశాంతి పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలతో ఆరోగ్యానికి ఎంతో మేలు అని ఏపీఎం టి.మోహన్‌రావు అన్నారు. ఏఎస్ఓ పుష్పలత, వీఆర్వో వెంకట్రావు, వీఆర్ఏ అరుణ, యూనిట్ ఇన్‌చార్జ్ బి.వెంకటస్వామి, సిబ్బంది చిన్న, బుజ్జిబాబు, వంశీ, నరియమ్మ, అరుణ, నవ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న ధర్మరాజు

వేటపాలెం: రైతులు ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు నాణ్యమైన దిగుబడులు సాధించుకోవచ్చని డాక్టర్ ధర్మరాజు సూచించారు. సోమవారం పందిళ్లపల్లి ప్రిపేరు సేవా సంస్థ కార్యాలయం వద్ద రైతులకు ఆర్గానిక్ పద్ధతుల్లో కూరగాయల పంట సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జీవా మృతం, పంచగవ్య ద్రావాణాల తయారు చేసే విధానం వివరించారు. తక్కువ ఖర్చుతో పురుగు నియంత్రణకు ఉపయోగించ వాడే చెట్ల ఆకులు, నూనెతో తయారు చేసుకొనే పద్ధతులు తెలియజేశారు. ఆర్గానిక్ సాగు ద్వారా పండించిన కూరగాయలు తినడ వల్ల ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. పెరటిలో సాగు చేసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. అనంతరం సంస్థ తరపున పది మహిళా గ్రూలకు చెందిన 97 మందికి రూ. 18.55 లక్షల రుణాల చెక్కులు అందజేశారు. సంస్థ ప్రాజెక్టు అధికారి ఎస్. బృందా, కోఆర్డినేటర్ రవిచంద్ర, టి.ఉమా పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండ పాలెం గ్రామ గిరిజనుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అద్దంకి తహసీల్దార్ ఆఫీస్‌లో ఆర్ఐ శంకరరావును వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన పట్టాలను గ్రామానికి చెందిన పెత్తందారులు పేదలకు అందజేయలేదన్నారు. ఆ పట్టాలు వారి వద్దే ఉంచుకుని మరొకరికి ఇచ్చి సొమ్ము చేసుకున్నారన్నారు. అదేమిటని అడగ్గా పోలీస్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు కూడా పెత్తందారుల వైపే మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి పేదలకు పట్టాలు అందజేయాలని కోరారు.